సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

'ఆసరా'తో ఆర్థిక భరోసా

- పేద మహిళలకు బాసట
- వైఎస్సార్ ఆసరాతో వెలుగులు
- జోన్- 5లో 33,750 మందికి లబ్ధి


చిరు వ్యాపారం చేసుకుంటున్న మహిళ


పకోడి బండి నడుపుతున్న మహిళ

కంచరపాలెం: పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'ఆసరా'తో పేద మహిళల జీవితాలకు భరోసా కల్పిస్తోంది. దీంతో చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ తమ కుటుంబాలను ఆర్థికంగా చక్కదిద్దుకుంటున్నారు. గతంలో ప్రభుత్వాలు తమ కోసం ఆలోచించలేదని... జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక తమ బాగు కోరుకుంటున్నారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల కోసం ఆలోచించే ఇటువంటి ముఖ్యమంత్రిని ఎన్నడూ చూడలేదని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు అండగా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారు. మహిళా సాధికారత కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగా 'ఆసరా' పథకం మహిళలకు చక్కటి ఉపాధినందిస్తోంది. రుణమాఫీ పొందిన మహిళలు ఇంటి వద్దే చిరు వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలకు దన్నుగా నిలుస్తున్నారు. జీవీఎంసీ జోన్-5 ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి ఆయా వార్డుల సచివాలయాల పరిధిలో సుమారు 33,750 మందికి పైగా 'ఆసరా' చేయూతతో చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు.

పేద మహిళల బతుకుల్లో వెలుగులు

గత ప్రభుత్వ హయాంలో పింఛన్లు నెలలో ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి ఉండేది. రుణమాఫీ కూడా అంతంత మాత్రమే. పావల వడ్డీ రుణాలు పరిస్థితి అలానే ఉండేది. గత ప్రభుత్వంలో ఎన్నికల హడావుడిలో పసుపు-కుంకుమ పెట్టడమే కనిపించేది. ఎలాంటి ఆధారం లేక అప్పుల పాలయ్యేవారు. దీంతో ఎంతో మంది మహిళలు ఇల్లు, పిల్లల్ని వదిలి కూలి పని చేసుకునే దుస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో జగనన్న ప్రభుత్వం వచ్చాక పేదల బతుకుల్లో వెలుగులు వచ్చాయి. ముఖ్యంగా మహిళలు ఎంతో ఆనందంగా ఉన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నాలుగున్నరేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దశల వారీగా రుణమాఫీ చేసి ఆడపడుచుల బతుకుల్లో వెలుగులు నింపారు.

జోన్-5 పరిధిలో 2023-24 సంవత్సరానికి 'ఆసరా' లబ్ధిదారుల వివరాలు

వార్డు	లబ్ధిదారులు	నగదు మొత్తం
42	2,985	6,88,54,566
43	2,608	6,96,32,546
44	3,996	8,93,64,526
45	2,665	7,45,68,935
46	3,216	8,94,52,635
47	2,546	6,68,95,632
48	2,149	5,93,54,265
49	1,198	4,95,85,364
50	2,365	5,84,26,325
51	1,938	5,53,24,863
53	2,136	6,24,83,218
54	2,796	5,34,96,526
55	3,152	6,99,84,536

మొత్తం లబ్ధిదారుల సంఖ్య
33,750 మంది

'ఆసరా' ద్వారా పొందిన నగదు
రూ.86,74,23,937

'ఆసరా' ఆదుకుంది



ఆర్థికంగా ఇబ్బంది పడిన మా జీవితాలను జగనన్న ఆసరా ఆదుకుంది. వడ్డీలకు డబ్బు తీసుకుని వ్యాపారం చేసుకునే రోజులు పోయాయి. జగనన్న ఇస్తున్న 'ఆసరా' నగదుతో కూరగాయలు వ్యాపారం భర్తతో కలిసి చేస్తున్నా.. దీంతో మా కుటుంబం ఆర్థిక ఇబ్బందులు లేకుండా జీవిస్తున్నాం. రానున్న ఎన్నికల్లో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అవ్వాలి.

– పి.సుభాలక్ష్మి, కూరగాయల వ్యాపారం, కంచరపాలెం

కష్టాలు తీరాయి



వివిధ వంటలతో చిరు వ్యాపారం ప్రారంభించా. గతంలో నా భర్త కష్టపడితే గానీ ఇల్లు గడిచేది కాదు. ఇప్పుడు వైఎస్సార్ 'ఆసరా'తో చేస్తున్న చిరువ్యాపారంతో కష్టాలు తీరాయి. ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాం. కుటుంబమంతా సంతోషంగా ఉన్నాం. జగనన్న వల్ల మా జీవితాలు బాగుపడ్డాయి. తీసుకున్న రుణం కూడా సమయానికి తీర్చే ధైర్యం వచ్చింది.

–ఎస్. భావన, చిరు వ్యాపారి, కంచరపాలెం

అర్హులందరికీ 'ఆసరా'



జోన్-5 పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు 'ఆసరా' రుణాలు అందేలా చర్యలు తీసుకున్నాం. సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో అర్హులను గుర్తించి ఆసరా రుణాలు అందించాం. రుణాలు తీసుకున్న లబ్ధిదారులు చక్కగా వ్యాపారాలు చేసుకుంటూ రుణాలు తీర్చుకుంటున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ప్రతి సంక్షేమ ఫలం అర్హులకు అందేలా కృషి చేస్తున్నాం. ఏదైనా ప్రభుత్వ సంక్షేమ పథకం రాకపోతే వెంటనే తెలియజేస్తే అర్హులైన వారికి ఇంటికి సెక్రటరీలు వెళ్లి పథకం అందేలా చర్యలు తీసుకుంటారు.

–ఆర్‌జీవీ కృష్ణ, జోనల్ కమిషనర్, జోన్-5, జ్ఞానాపురం

కార్పొరేటర్ ఉషశ్రీకి సీఎం అభినందన


కార్పొరేటర్ ఉషశ్రీ సాధించిన బంగారు పతకాలను చూస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

సీతంపేట: రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించిన 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. బ్యాడ్మింటన్‌లో 40 ప్లస్ మహిళల కేటగిరీలో అద్భుతమైన ప్రతిభతో రాణించి వరుసగా సింగిల్స్, డబుల్స్, మిక్స్ డ్ డబుల్స్ విభాగాలలో సాధించిన బంగారు పతకాలను విశాఖలో ఒక కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన సీఎంకు చూపించారు. సీఎం చేతుల మీదుగా ఉషశ్రీ మెడల్స్ అందుకున్నారు. జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వదించారు.




ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలుకుతున్న మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకట రెడ్డి

సీఎం జగన్‌కు ఆత్మీయ స్వాగతం

సీతమ్మధార: విశాఖ విజన్ సదస్సులో పాల్గొనేందుకు మంగళవారం నగరానికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు ఘనంగా స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేశారు.


ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి


ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

ఘనంగా మహిళా దినోత్సవం


మహిళలను సత్కరిస్తున్న సంఘం అధ్యక్షులు పెబ్బిలి రవికుమార్


మాట్లాడుతున్న వాకర్స్ ఇంటర్‌నేషనల్ ఎలెక్ట్ ప్రెసిడెంట్ ప్రభావతి

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పెబ్బిలి రవికుమార్‌ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, రాజకీయాల్లో కూడా మహిళలకు పురుషులతో సమానంగా సీట్లు కేటాయించాలన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీ మహిళలకు ఎక్కువ సీట్లు ఏ పార్టీ కేటాయిస్తుందో ఆ పార్టీకి బీసీ ప్రజా సంక్షేమ సంఘం మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సి.హెచ్.నాగేశ్వరరావు, సౌత్‌ఇండియా కన్వీనర్ కృష్ణవేణి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఊర్వశి మహాలక్ష్మి, నజీమా బేగం, పద్మ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోసూరు శ్రీనివాసరావు , పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో మహిళలు రాణించాలి

మద్దిపాలెం: మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వర్మా కాంప్లెక్స్ దరి ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్లో మంగళవారం నిర్వహించిన వేడుకల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని సందడి చేశారు. ముఖ్య అతిథిగా వాకర్స్ ఇంటర్‌నేషనల్ ఎలెక్ట్ ప్రెసిడెంట్ ఎం.ప్రభావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత కుటుంబ విలువలు, పిల్లల పెంపకం ఎలా ఉండాలని వివరించారు. అతిథులు శుభా, లక్ష్మీరెడ్డి, శ్యామలా దీపిక మాట్లాడారు. ఇటీవల జరిగిన వంటల పోటీలు, నడక పోటీల్లో విజయం సాధించిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు లలితారెడ్డి, కమిటీ సభ్యులకు మహిళలంతా అభినందనలు తెలిపారు.

'అక్షయ పాత్ర'లో గ్యాస్ బాయిలర్ ఏర్పాటు


శిలాఫలానికి ప్రారంభిస్తున్న అనిల్‌కుమార్

కంచరపాలెం: కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో నాణ్యమైన ఆహార పదార్థాల సరఫరాలో పేరుపొందిన అక్షయ పాత్ర ఫౌండేషన్ నూతన ఆవిష్కరణకు శ్రీకారం చుట్టిందని (టీఏపీఎస్‌ఓ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్టేట్ హెడ్ బి.అనిల్‌కుమార్ పేర్కొన్నారు. కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని అక్షయ పాత్ర ఫౌండేషన్ యూనిట్‌లో ఇండియన్ ఆయిల్ సౌజన్యంతో రూ.20లక్షలతో ఏర్పాటు చేసిన గ్యాస్ బాయిలర్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ 850 కిలోల సామర్థ్యంతో గ్యాస్ బాయిలర్‌ను ఏర్పాటు చేశామని, గతంలో డీజిల్‌తో నడిచే బాయిలర్ ఉండేదన్నారు. గ్యాస్‌కు బాయిలర్‌గా మార్చడం ద్వారా రోజుకు రూ.6 వేలు ఆదా అవుతుందన్నారు. దీంతో పాటుగా పొల్యూషన్ తగ్గుతుందన్నారు. కంచరపాలెం శాఖ కేంద్రంగా ప్రతి రోజు 137 పాఠశాలకు సుమారు 30వేల మంది విద్యార్థులకు (జగనన్న గోరుముద్ద) మధ్యాహ్న భోజన పథకం ద్వారా భోజనం అందించడంతో ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం వంటశాల పరికరాలు పరిశీలించారు. ముందుగా ఫౌండేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అక్షయ పాత్ర ఫౌండేషన్ యూనిట్ అధ్యక్షుడు భక్త దాస్, హ్యూమన్ రిసోర్స్ సీఆన్ ఆర్.సూరజ్ కుమార్ పట్నాయక్, డివిజనల్ బిజినెస్ హెడ్ సురజిత్ కందూ, బి.అనిల్ కుమార్, రీజినల్ ఆపరేషన్ మేనేజర్ పి.రామమోహన్ పాల్గొన్నారు.

వైశాఖి పార్కులో లక్ష్మీనారాయణ..

మద్దిపాలెం: జీవీఎంసీ 50వ వార్డులోని వైశాఖి స్పోర్ట్స్ పార్కును సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ మంగళవారం సందర్శించారు. సువిశాలమైన పార్కులో పచ్చదనం, మహిళలకు, వృద్ధులకు,చిన్నారులకు వాకింగ్ ట్రాక్‌లు, స్కేటింగ్ రింక్, జిమ్, స్విమ్మింగ్‌పూల్, మెడిటేషన్ వంటి వసతులు కల్పించడం అభినందనీయమని అన్నారు. పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ జేడీని సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి పీవీఎస్ఎన్ రాజు, కోశాధికారి మళ్ళ రామకృష్ణ, రఘురాం పొండా, గోవింద రెడ్డి, చింతాడ రామారావు, పొందూరు సూర్యనారాయణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రూ.30 లక్షలతో 'నాగావళి' ఆధునికీకరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో రూ.30 లక్షల నిధులతో ఆధునికీకరించిన హాస్టల్ భవన సముదాయం నాగావళి పేరిట అందుబాటులోకి వచ్చింది. నాడు-నేడు పథకంలో భాగంగా అభివృద్ధి చేసిన ఈ హాస్టల్‌ను మంగళవారం ఉదయం విద్యార్థినులతో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ప్రారంభింపజేశారు. కళాశాలలో పెరుగుతున్న విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా అదనపు హాస్టల్‌ని అందుబాటులోకి తీసుకువచ్చారు. కొత్త హాస్టల్ వసతి అందుబాటులోకి రావడంతో విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం వీసీ విద్యార్థినులతో మాట్లాడారు. అక్కడే టిఫిన్ చేసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్స్ ఆచార్య జి.శశిభూషణరావు, ఆచార్య ఎస్.కె.భట్టి, ఆచార్య కె.విశ్వేశ్వరరావు, చీఫ్ వార్డెన్ కె.దుర్గారాణి, తదితరులు పాల్గొన్నారు. ఈ హాస్టల్ భవనానికి నాగావళి అని పేరు పెట్టారు.

హాస్టల్ విశేషాలు: గతంలో బాలురకు వినియోగించిన బ్లాక్-4 హాస్టల్‌ని ఇప్పుడు పూర్తి స్థాయిలో ఆధునీకరించి విద్యార్థినులకు కేటాయించారు. గుండ్రంగా ఉండే ఈ భవనంలో మొత్తం 96 గదులు ఉన్నాయి. ఒక్కో గదిలో ఇద్దరి చొప్పున 192 మంది విద్యార్థినులకు వసతి కల్పించారు. అవసరమైన మంచాలను వర్సిటీ సమకూర్చింది. మూడు అంతస్తుల్లో మొత్తం ఆరు టాయిలెట్స్ బ్లాక్‌లను అభివృద్ధి చేశారు. అధునాతన టైల్స్ వేసి కొత్తగా తీర్చిదిద్దారు. హాస్టల్ బయట పాడైన నీటి సరఫరా, డ్రైనేజీ పైపులను మార్పు చేశారు. పై అంతస్తులో నీటి నిల్వకు అదనపు ట్యాంకులను ఏర్పాటు చేశారు. దుస్తులు ఉతుక్కోవడానికి ఉపయుక్తంగా షెడ్ నిర్మించారు.

భవనం చుట్టూ ప్రహరీ : హాస్టల్ భవనం చుట్టు ఒక వైపు సిమెంట్ గోడను, మరో వైపు ఎత్తయిన ఇనుప కంచెను నిర్మించారు. భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ హాస్టల్ చుట్టూ రక్షణ గోడను నిర్మించారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన


నియామక పత్రాలతో ఎంపికైన అభ్యర్థులు

డాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. కళాశాల జవహర్ నాలెడ్జి సెంటర్ (జేకేసీ), నోడల్ రీసోర్స్ సెంటర్ (ఎన్ ఆర్‌సీ), ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులతో పాటు యలమంచిలి, పాడేరు, నక్కపల్లి, నర్సీపట్నం, మాడుగుల నుంచే కాక విశాఖ జిల్లాలో గల వివిధ ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు సుమారు 1630 మంది పాల్గొన్నారు. జాబ్‌మేళాలో అరబిందో, యకోమా, గ్రీన్‌టెక్, సినర్జీస్, ఇన్ఫోసోర్స్, డబ్ల్యూఎస్ఎస్, వెంచూర్ ఆఫ్‌షోర్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, డెక్కన్ ఫైన్ కెమికల్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. 280 మందిని ఎంపిక చేసినట్టు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వై. లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల జేకేసీ కో ఆర్డినేటర్ అరుణపద్మ, ఎన్ఆర్‌సీ కో ఆర్డినేటర్ డాక్టర్ శిరీష, జేకేసీ మెంటార్ ఎంఎస్ ప్రజ్ఞ, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాల్య వివాహాలపై అవగాహన

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ, సచివాలయం ఆధ్వర్యంలో శ్రీముఖ పాఠశాలలో విద్యార్థినులకు మంగళవారం బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కౌమార దశలో బాలికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సచివాలయం ఎంఎస్‌కే వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ మౌలాబీబీ, ఏఎన్ఎం స్రవంతి, ఆశా వర్కర్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణం తొలగింపు


సీతంపేటలో అనధికారంగా వేసిన డకింగ్ తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సీతంపేట : జీవీఎంసీ 25వ వార్డు కనకమ్మ వారి వీధిలో అనధికారంగా నిర్మిస్తున్న అదనపు అంతస్తును జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. స్థానిక కనకమ్మ వారి వీధిలో సుమారు 180 గజాల స్థలంలో ఇంటి నంబరు 50-73-20లో జీప్లస్2 అంతస్తులు నిర్మాణానికి అనుమతి తీసుకున్నారు. అనుమతి లేకుండా మూడో అంతస్తు నిర్మాణానికి డకింగ్ వేయడంతో స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారులు ఆదేశాలతో చర్యలు చేపట్టారు. జోన్3 టీపీవో ప్రమీల ఆధ్వర్యంలో చైన్‌మన్ రాజు , ఇతర సిబ్బంది కలసి డకింగ్ తొలగించారు. అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని టీపీవో తెలిపారు.

శివరాత్రి వేడుకలకు విస్తృత ఏర్పాట్లు


విద్యుత్ అలంకరణలో ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం

సీతమ్మధార: ఈ నెల 8వ తేదీన మహాశివరాత్రి వేడుకలకు పలు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. నక్కవానిపాలెంలోని శ్రీ ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో క్యూలైన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నార్త్‌ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా ఆలయంలో శివరాత్రి వేడుకలకు సిద్ధం చేస్తున్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

7న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 7న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ నార్త్
8309817091

పార్టీ విజయానికి కృషి చేయండి


మాట్లాడుతున్న కేకేరాజు

సీతమ్మధార : వైఎస్సార్‌సీపీ పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయాలని పార్టీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు పిలుపునిచ్చారు. మంగళవార బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో 50, 51 వార్డులకు సంబంధించి పోలింగ్ బూత్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకుళ్లాలని కోరారు. సంక్షేమ పథకాలు తీసుకున్న ప్రతి ఒక్కరు వైఎస్సార్‌సీపీకి ఓటు వేసే విధంగా విస్తృత ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్, పార్టీ మండల అధ్యక్షుడు అల్లు శంకరావు, కార్పొరేటర్ రెయ్యి వెంకట రమణ, వి.ప్రసాద్, మండల అధ్యక్షులు కృష్ణారావు మాస్టార్, జేసీఎస్ నియోజకవర్గం కన్వీనర్ బగాతి విజయ్, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు జగన్నాథపురంలో రూ. 39 లక్షలతో రెండు అంతస్తుల్లో దోబీఖానా నిర్మిస్తున్నారు. మొదటి అంతస్తులో దోబీఖానా, రెండో అంతస్తులో కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరుగుతోంది. మంగళవారం మొదటి శ్లాబ్ నిర్మాణం జరిగింది. వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పనులు పూర్తి చెయ్యాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

బాల్యం నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ జ్యోతి

కంచరపాలెం: బాల్యం దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ అర్బన్ మర్రిపాలెం ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ జెటీఎస్ జ్యోతి అన్నారు. ఈ మేరకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కంచరపాలెం పరిధి జీవీఎంసీ ఆర్పీపేట ఉన్నత పాఠశాలలో మంగళవారం కిశోర బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు విజయలక్ష్మి, సన్యాసమ్మ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై హ్యూమన్ రైట్స్ ప్రతినిధుల చర్చ


మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్టు కార్యవర్గం

సీతంపేట: మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్టు, నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ విశాఖపట్నం శాఖ సంయుక్తంగా కార్యవర్గ సమావేశం మంగళవారం అక్కయ్యపాలెంలో కార్యాలయంలో జరిగింది. మహమ్మద్ బాషా అధ్యక్షతన జరిగిన సమావేశంలో నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర చైర్మన్ మళ్ల వెంకటరావు ముఖ్య అతిథిగా హాజరై ట్రస్టు కార్యవర్గంలో ఖాళీగా ఉన్న పోస్టులకు ఎన్నిక నిర్వహించారు. ట్రస్టు ఉపాధ్యక్షులుగా అంజలి, కార్యదర్శిగా టి.జగదీష్‌ను ట్రస్టు మహిళా విభాగం గౌరవాధ్యక్షురాలు మళ్ల లక్ష్మి ప్రతిపాదించగా సభ్యులంతా వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నేషనల్ ఫెడరేషన్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌కు వచ్చిన ఫిర్యాదులు, బాధితులకు న్యాయం చేసేందుకు ఎండోమెంట్ విభాగం, భీమిలి తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లాలని తీర్మానించారు. ప్రధాన కార్యదర్శి కందాల ప్రభాకర్‌రావు, ఎన్ఎఫ్‌హెచ్‌ఆర్‌సీ పూర్ణానందరావు, లచ్చన్న, ఉమారాణిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, కనిశెట్టి అప్పారావు, రాపేటి కృష్ణ, అంజలి శ్రీనివాస్, మహమ్మద్ బాషా, శ్రీదేవి, రాంబాబు, మళ్ళ లక్ష్మి పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com